


# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 108,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,బుధవారం, తేదీ : 19-08-2026

## ‘ఎక్స్‘ వేదికగా విషెస్ తెలిపిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



దేశ ప్రగతికి మీరే మార్గదర్శి.. నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు బర్త్‌డే విషెస్

దేశ ప్రగతికి మీ మార్గనిర్దేశం కొనసాగాలని ఆకాంక్ష

సంపూర్ణ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ప్రార్థన

ఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా ‘ఎక్స్‘ (ట్విట్టర్) వేదికగా ఆయన ఓ ప్రత్యేక సందేశాన్ని పోస్ట్ చేశారు. నిర్మలా సీతారామన్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చంద్రబాబు ట్వీట్ చేశారు. “గౌరవనీయ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీరు అచంచలమైన మిగతా..2లో

## మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి



రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని మండిపాటు

పెద్ద తప్పు చేసి క్షమాపణల చెబితే ప్రజల బాధలు తీరవని వ్యాఖ్య

కల్యాణలక్ష్మి పథకాన్ని సంతానలక్ష్మి పథకంగా మార్చేశారని మండిపాటు

హైదరాబాద్: సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చిక్కులు సృష్టిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో మిగతా..2లో

## హైదరాబాద్ లో పలు ప్రాంతాల్లో వర్షం ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణకు వర్ష సూచన



- జూబ్లీహిల్స్ , బంజారాహిల్స్ , ఫిల్మ్ నగర్ , పంజాగుట్ట వర్షం
- ఉత్తర తెలంగాణలో ఇవాళ, రేపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు
- గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు

ఢిల్లి : ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై హైదరాబాద్ నగరంలో పలుచోట్ల వర్షం కురుస్తోంది. జూబ్లీహిల్స్ , బంజారాహిల్స్ , ఫిల్మ్ నగర్, పంజాగుట్ట, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్ పేట్ , ఎస్ .ఆర్ .నగర్, సనత్ నగర్, యూసఫ్ గూడ, కృష్ణానగర్, మధురానగర్ సహా పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. సాయంత్రం ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది కలిగింది. పలుచోట్ల వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. ఉత్తర తెలంగాణకు వర్షసూచన : ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఇవాళ, రేపు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

## బీజేపీకి అనుబంధ సంస్థగా మారిన ఎన్నికల సంఘం

- 2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు.
- ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు.



హైదరాబాద్, ఆగస్టు18: 2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. మిగతా..2లో

## మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం



- భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పున ఇస్తామన్న కవిత
- రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ
- రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ

హైదరాబాద్ : తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ‘భూ లక్ష్మి పథకం’ కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని మిగతా..2లో

## నీట్‘ విద్యార్థులపై పోలీసు చర్యలు విచారణకు హైపవర్ కమిటీ ఏర్పాటు



- నీట్ నిరసనల వేళ విద్యార్థులపై పోలీసు చర్యలు
- విచారణకు హైపవర్ కమిటీ ఏర్పాటు చేయనున్న సుప్రీంకోర్టు

ఢిల్లి : దిల్లీలో నీట్ నిరసనల సందర్భంగా విద్యార్థులను చెదరగొట్టేందుకు పోలీసులు అతిగా చర్యలు తీసుకున్నారనే ఆరోపణలపై విచారణ చేసేందుకు ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. ఇందులో రిటైర్డ్ న్యాయమూర్తులు,

## 2027 అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్ , గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లు

- పంజాబ్ బాధ్యతలు సతీశ్ పూనియాకు- గుజరాత్ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కీలక నియామకాలు



ఢిల్లి : వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ఇప్పటి నుంచి వ్యూహాలను పదును పెడుతోంది. ఉత్తర్ ప్రదేశ్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మంగళవారం ఆయా రాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌లు, కో-ఇన్‌ఛార్జ్‌లను నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ వెల్లడించింది. ఈ మేరకు బీజేపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డేను నియమించారు. కో-ఇన్‌ఛార్జ్‌గా జాతీయ కార్యదర్శి జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్‌కు బాధ్యతలు అప్పగించారు. దేశ రాజకీయాల్లో కీలక రాష్ట్రంగా ఉన్న యూపీలో 2027 అసెంబ్లీ ఎన్నికల నేథ్యంలో సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల వ్యూహంపై తావ్డే బృందం దృష్టి పెట్టనుంది. ఇక పంజాబ్ రాష్ట్ర భాజపా ఇన్‌చార్జ్‌గా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సతీశ్ పూనియాను నియమించారు. అలాగే గుజరాత్ బాధ్యతలను రాజ్యసభ సభ్యుడు, మిగతా..2లో

## విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం సంతోషకరంగా ఉంది

- విద్యార్థులు, ఝార్ఖండ్ ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం కుదరడంపై రాహుల్ గాంధీ హర్షం
- విద్యార్థుల భవిష్యత్తుకు న్యాయం జరిగేలా దేశవ్యాప్తంగా వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని వెల్లడి



ఢిల్లి : ఝార్ఖండ్ ప్రభుత్వం, విద్యార్థుల మధ్య చర్చలు సఫలం కావడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చర్చల మార్గాన్ని ఎంచుకోవడం, విద్యార్థులు సంయమనం పాటించి తమ డిమాండ్లను ఆమోదించేలా చేసుకోవడం సరైన విధానమని ప్రశంసించారు. విద్యార్థులను వెనక్కి లాగడానికి బదులుగా వారిని ముందుకు నడిపించే వ్యవస్థను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. “ఝార్ఖండ్ విద్యార్థులు మిగతా..2లో

## డ్రోన్ సిటీతో ప్రత్యక్షంగా 5 వేలు, పరోక్షంగా 25 వేల ఉద్యోగాలు

మంత్రి రామ్మోహన్ నాయుడు



- డ్రోన్ సిటీ ఏర్పాటుకు ఇప్పటివరకు రూ. 130 కోట్ల పెట్టుబడులు
- రెండు, మూడు సంవత్సరాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసే దిశగా చర్యలు
- డ్రోన్ సిటీ ఏర్పాటుతో యువతకు చాలా అవకాశాలు

అమరావతి : కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పాలకొలను వద్ద ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీలో పెట్టుబడులు, పరిశ్రమలపై కేంద్ర విమానయాన శాఖ మంత్రి

## అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలే ప్రధాన అజెండాగా భేటీ
- పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలపై చర్చ



అమరావతి : స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.1 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.16,500 కోట్ల నిధులు మురిగిపోకుండా అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఏపీ పంచాయతీరాజ్ చట్టం-1994 నిబంధనల ప్రకారం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. న్యాయపరమైన అంశాల్లో ఉన్న 23 మునిసిపాలిటీల విలీనాన్ని తర్వాత పరిశీలిద్దామని, ముందుగా అన్ని స్థానిక సంస్థల్లో ఎన్నికలు నిర్వహిద్దామని స్పష్టం చేశారు. మేయర్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, పాత విధానంలో ఒక్క డిప్యూటీ మేయర్ పదవికే పరిమితం కావాలని నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లే కొనసాగుతాయని స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ మిగతా..2లో

## పెట్టుబడుల్లో ఏపీ దూకుడు.. దేశంలోనే 2వ స్థానం

చంద్రబాబు విజన్ వల్లేనన్న మంత్రి లోకేశ్



- నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీకి దేశంలో 2వ స్థానం
- కేవలం 24 నెలల్లోనే 9వ స్థానం నుంచి రెండో ర్యాంకుకు చేరిన రాష్ట్రం
- సీఎం చంద్రబాబు నాయకత్వమే కారణమన్న మంత్రి లోకేశ్
- స్పష్టమైన విజన్, పారదర్శక పాలనే విజయానికి మూలమని వెల్లడి
- ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టి ఇప్పుడు ఏపీపై ఉందని వ్యాఖ్య

అమరావతి : నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ మిగతా..2లో

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

బుధవారం 19-08-2026

## మొదటి పేజీ తరువాయి

## పెట్టుబడుల్లో ఏపీ దూకుడు.. దేశంలోనే 2వ స్థానం

దేశంలోనే రెండో స్థానానికి చేరుకుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కేవలం 24 నెలల వ్యవధిలోనే రాష్ట్రం 9వ స్థానం నుంచి 2వ స్థానానికి ఎగబాకిందని ఆయన వెల్లడించారు. ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వం వల్లే సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, పారదర్శక పాలన, వ్యాపార నిర్వహణలో వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి" అని వివరించారు. రాష్ట్రం వేగంగా పారిశ్రామిక శక్తిగా ఎదుగుతుండటం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సానుకూల వాతావరణంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలను అందిస్తుండటంతో, ఇప్పుడు ప్రపంచం చూపు ఏపీ వైపు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

## బీజేపీకి అనుబంధ సంస్థగా మారిన ఎన్నికల సంఘం

కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ పామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.

## మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం

పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. కేబినెట్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం నడుస్తోందని మండిపడ్డారు.

## మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి

జరిగిన పెద్ద తప్పిదానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించకపోతే... ముఖ్యమంత్రి, మంత్రులు కలిసే ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు క్షమాపణలు చెబితే ప్రజల బాధలు తీరవని, అసలు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చమని ఆదేశించింది ఎవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదని, వారు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు. భూములను నిషేధిత జాబితాలో పెట్టింది ప్రభుత్వమే కాబట్టి, ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకోకుండా వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్సీని రద్దు చేయడంతో ఆ స్థలాలు పట్టా భూములుగా మారాయని... అలాగే జీఓల ద్వారా మినహాయింపు పొందిన హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా ఇప్పుడు 22 లో చేర్చి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కల్యాణలక్ష్మి పథకం 'సంతానలక్ష్మి'గా మారిపోయిందని, పెళ్లి సమయానికి అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత గానీ రావడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పు చేసిన కాంగ్రెస్ నేతలను చట్టపరంగా బాధ్యులను చేస్తామని హెచ్చరిస్తూ, 22ఏ భూముల అంశంపై కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీ వేదికగా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

## హైదరాబాద్ లో పలు ప్రాంతాల్లో వర్షం - ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణకు వర్ష సూచన

కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడే అవకాశమున్నట్టు తెలిపింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఎల్లుండి అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. రాగల రెండు రోజులు కింది స్థాయి ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వెల్లడించింది.

## 'ఎక్స్' వేదికగా విషెస్ తెలిపిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

శక్తితో దేశ ప్రగతికి మార్గనిర్దేశం చేస్తూ, సంపూర్ణ ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ప్రార్థిస్తున్నాను" అని చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నిర్మలా సీతారామన్ పుట్టినరోజు కావడంతో ప్రధానమంత్రితో పాటు పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## 'నేను ఎమ్మెల్యే అయ్యేనాటికి అమిత్ షా పుట్టనేలేదు'- ఖర్గే ఘాటు వ్యాఖ్యలు

**అమిత్ షాపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు- తాను ఎమ్మెల్యే అయ్యే నాటికి అమిత్ షా చిన్నపిల్లాడు అంటూ వ్యంగ్యాస్త్రాలు- స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఏంటని ప్రశ్న**

ఢిల్లీ : బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు చేశారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన సమయానికి అమిత్ షా ఇంకా పుట్టలేదని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ నేతల పాత్రను గుర్తుచేస్తూ, దేశభక్తి గురించి తమకు పాఠాలు చెప్పే హక్కు బీజేపీకి లేదని వ్యాఖ్యనించారు. దక్షిణ గోవాలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఖర్గే ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'బీజేపీ పదేపదే గాంధీ కుటుంబం సోనియా గాంధీ గురించి ప్రస్తావిస్తోంది. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటికే అమిత్ షా ఇంకా పుట్టలేదు. ఆయన వయసెంత? 57 లేదా 58 ఏళ్లా? 56-58 ఏళ్ల వయసున్న నాయకులు మాకు దేశభక్తి గురించి చెబుతున్నారు. గాంధీజీ తన జీవితాన్నే దేశ స్వాతంత్ర్యం కోసం అంకితం చేశారు. నెహ్రూ 14 ఏళ్ల పాటు జైలులో గడిపారు. అలాంటి చరిత్ర కాంగ్రెస్‌కు ఉంది. దేశ స్వాతంత్ర్యం కోసం తమ నాయకులు పోరాడారు. మరి బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ నుంచి ఏ నాయకుడు స్వాతంత్ర్యం కోసం పోరాడారు? దేశభక్తి ఉంటే ఐక్యత గురించి బీజేపీ మాట్లాడాలి. ప్రజలను విడదీయడం, ఘర్షణలకు కారణమవడం దేశభక్తి కాదు. మత సామరస్యం, లౌకికవాదం, ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేయడమే నిజమైన దేశభక్తి' అని ఖర్గే వ్యాఖ్యానించారు. 'మతం పేరుతో విభజన సరికాదు' లో తన బహిరంగ సభ జరిగిన ప్రాంతంలో శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించడాన్ని కూడా ఖర్గే ప్రస్తావించారు. లక్షలాది మంది సమక్షంలో తాను ప్రసంగించిన తర్వాత అక్కడ శుద్ధీకరణ చేయడమేంటని ప్రశ్నించారు. ఇది ఏ మతం బోధించే విలువ అని నిలదీశారు. మతరం పేరుతో ప్రజల మధ్య విభజన సృష్టించకూడదని అన్నారు. ఆర్ ఎస్ ఎస్ సిద్ధాంతకర్త ఎంఎస్ గోల్వాల్కర్, ఇతర గురువులు ఇలాంటివే బోధించరా అని ప్రశ్నించారు.

### '56 ఏళ్ల ప్రజాజీవితం కాంగ్రెస్ వల్లే'

తాను దాదాపు 56 ఏళ్లుగా ప్రజాజీవితంలో ఉన్నానని ఖర్గే తెలిపారు.తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు లోక్ సభ సభ్యుడిగా, రెండు సార్లు రాజ్యసభ ఎంపీగా పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదంతా తనకు కాంగ్రెస్ వల్లే వచ్చిందని తెలిపారు. చిన్నతనంలోనే తల్లి, సోదరుడు, సోదరిని కోల్పోయానని చెప్పారు. తన ఇల్లు కూడా దగ్ధమైందని, అయినప్పటికీ తాను వెనక్కి తగ్గకుండా ప్రజాజీవితంలో కొనసాగుతున్నానని అన్నారు. తనకు లభించిన అన్ని రాజకీయ అవకాశాలు కాంగ్రెస్ పార్టీ వల్లేనని పేర్కొన్నారు.

### 'గోవాలో ఫిరాయింపులతో ప్రభుత్వం'

ఇక గోవా రాజకీయలాపై కూడా ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను పార్టీ మార్పించి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆరోపించారు. ప్రజల తీర్పు గౌరవించకుండా ఫిరాయింపులకు ప్రోత్సహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రజలను అవమానించే, దోచుకునే నాయకులను తిరస్కరించాలని గోవా ఓటర్లకు పిలుపునిచ్చారు. గోవా సంస్కృతిని గౌరవించే పర్యాటకులకు రాష్ట్రంలో స్వాగతం ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే రాజకీయాలను అంగీకరించకూడదని అన్నారు.

## డ్రోన్ సిటీతో ప్రత్యక్షంగా 5 వేలు, పరోక్షంగా 25 వేల ఉద్యోగాలు : మంత్రి రామ్మోహన్ నాయుడు

### మొదటి పేజీ తరువాయి



రామ్మోహన్ నాయుడు చర్చించారు. రాష్ట్రంలోని వివిధ డ్రోన్ కంపెనీలకు చెందిన సీఈవోలతో కేంద్ర మంత్రి రౌండ్ టేబుల్ సమావేశం అయ్యారు. దాదాపు 70 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి రోడ్ మార్గాన డ్రోన్ సిటీకి చేరుకున్న కేంద్ర మంత్రి ముందుగా వివిధ కంపెనీలు ఏర్పాటు చేసిన డ్రోన్ స్టాళ్లను పరిశీలించారు. అడ్వాన్స్ టెక్నాలజీ తయారు చేసిన డ్రోన్ లు వాటి పనితీరును రామ్మోహన్ నాయుడు అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ సిటీలో పెట్టుబడులు, అభివృద్ధి, కావాల్సిన మౌలిక సదుపాయాలపై కేంద్ర మంత్రి చర్చించారు. 2004 డ్రోన్ పాలసీలో భాగంగా ఇక్కడ డ్రోన్ సిటీ ఏర్పాటు కానుంది. డ్రోన్ సిటీతో ప్రత్యక్షంగా 5వేలు, పరోక్షంగా 25 వేల ఉద్యోగాలు: మంత్రి రామ్మోహన్ నాయుడు 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కేంద్రం సాయంతో రాష్ట్రానికి ఎన్నో గొప్ప ప్రాజెక్టులు తీసుకొచ్చాం. నేడు పెట్టుబడులు పెట్టాలనుకునే పెద్ద పెద్ద కంపెనీలు ముందు ఆంధ్రప్రదేశ్ వైపే చూస్తున్నాయి. దీనంతటికీ కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది. వికసిత్ భారత్ దిశగా రాష్ట్రం పరుగు తీస్తుంది. చంద్రబాబు నాయుడు డ్రోన్ సిటీ ఏర్పాటుకు ఎంతో ఆసక్తి కనబరిచారు. ఎప్పటికప్పుడు దీని ఏర్పాటు పనులను సమీక్షిస్తున్నారు. డ్రోన్ కార్పోరేషన్ కూడా ఎంతో సహకరిస్తుంది. డ్రోన్ సిటీ ఏర్పాటుకు ఇప్పటివరకు రూ. 130 కోట్ల పెట్టుబడులు పెట్టాం. ఇది మొత్తంగా పూర్తవడానికి కనీసం రూ. 5 వేల కోట్ల పెట్టుబడులు అవుతాయని అంచనా వేస్తున్నాం. డ్రోన్ సిటీ పూర్తైతే ప్రత్యక్షంగా 5వేలు, పరోక్షంగా 25వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. రెండు, మూడు సంవత్సరాల్లో ఇక్కడ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డ్రోన్ సిటీ ఏర్పాటుతో యువతకు చాలా అవకాశాలు లభించనున్నాయి.'

## అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు – బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం

### మొదటి పేజీ తరువాయి

కమిషన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు కేబినెట్‌కు వివరించారు. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీలను జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. మొత్తం 57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణయం: ఉద్యోగాల కల్పన, పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలపై నిర్ణయాలు తీసుకున్నారు. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ విద్యార్థులకు ××-జీజుజు, చీజుజు కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లు, ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ బిల్లుపై చర్చించింది. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టొద్దు: మంత్రివర్గ అజెండా అంశాలపై చర్చ పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ పరిణామాలపై మంత్రులు, అధికారులతో చర్చించారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివ్ కామెంట్లపై ధీటుగా స్పందించాలని సూచించారు. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టకుండా కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా కంటైనర్లలో ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



## విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం సంతోషకరంగా ఉంది

### మొదటి పేజీ తరువాయి



రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. విద్యార్థులు తమ నిరాహార దీక్షను విరమించారు. ఈ వార్త వినడం సంతోషాన్ని ఇచ్చింది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఝార్ఖండ్ ప్రభుత్వం చర్చల మార్గాన్ని ఎంచుకుని పరిష్కారాన్ని కనుగొన్నారు. విద్యార్థులు సంయమనం పాటించి తమ డిమాండ్లను ఆమోదించేలా చేసుకున్నారు. ఇదే సరైన మార్గం. విద్యార్థులు ప్రశ్నలు అడిగినప్పుడు వారికి సమాధానాలు లభించాలి. మేము దేశంలోని ప్రతి విద్యార్థికి అండగా ఉంటాము. ప్రతి విద్యార్థికి వారి కష్టానికి తగిన ప్రతిఫలం, న్యాయమైన పోటీలో పాల్గొనేలా ఈ వ్యవస్థను పూర్తిగా మారుస్తాం" అని రాహుల్ గాంధీ తెలిపారు.

### జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్ష రద్దు

విద్యార్థుల డిమాండ్ల నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలని నిర్ణయించింది. అలాగే టీడీపీఎల్ సంస్థ నిర్వహించిన పరీక్షలు, వెలువడిన ఫలితాలు, ఆ ప్రక్రియ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన చర్యలన్నింటినీ రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. 2014 నుంచి రాష్ట్రంలో నిర్వహించిన వివిధ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశించింది. అలాగే రాంచీలోని సదర్ ఆసుపత్రిలో విద్యార్థి నేత దేవేంద్రనాథ్ మహతో నిరాహార దీక్ష విరమించారు. రాష్ట్ర మంత్రులు దీపికా పాండే సింగ్, ఇర్ఫాన్ అన్సారీ సమక్షంలో ఆయన దీక్షను ముగించారు. రాష్ట్రంలో నియామక పరీక్షల నిర్వహణ, పారదర్శకత, అవకతవకలపై విద్యార్థులు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో మహతో నిరాహార దీక్షకు దిగారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కీలక నిర్ణయాలు ప్రకటించడంతో ప్రభుత్వం-విద్యార్థుల మధ్య చర్చలు కొలిక్కి వచ్చాయి.

### జేపీఎస్‌సీ పరీక్షలపైనా విచారణ

ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో అవకతవకల ఆరోపణలపైనా సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. ఈ దర్యాప్తును రిటైర్డ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఎస్ఐటీ, సీఐడీ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నాయని, విచారణలో పలు దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయని సోరెన్ తెలిపారు. జేపీఎస్‌సీ ద్వారా నియమితులైన కొందరిని పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టు చేసినట్లు కూడా పేర్కొన్నారు. యువత ప్రధానంగా జేపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలపై స్పష్టత కోరుతోందని సోరెన్ తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే ప్రభుత్వం తరపున ఓ మంత్రి దర్యాప్తు జరుగుతోందని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం చెప్పిందే సరైనదిగా అనిపిస్తుందని, మరికొన్ని సందర్భాల్లో విద్యార్థుల వాదనలో నిజం కనిపిస్తుందని అన్నారు. రెండు వైపుల వాదనల్లో వాస్తవాన్ని తేల్చేందుకు సమగ్ర విచారణ అవసరమని సీఎం పేర్కొన్నారు.

### పరీక్ష రద్దుతో కొత్తగా మరో ఆందోళన

ఒకవైపు విద్యార్థుల ఆందోళనకు పరిష్కారం లభించినప్పటికీ, మరోవైపు జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ ద్వారా ఇప్పటికే నియమితులైన ఉద్యోగులు కొత్త సమస్యను ఎదుర్కొంటున్నారు. పరీక్ష రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలువురు ఉద్యోగులు రాంచీలోని ప్రాజెక్ట్ భవన్ వద్ద ఆందోళనకు దిగారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగులు పట్టుకుని, తాత్కాలిక టార్పాలిన్ కింద నిలబడి నిరసన తెలిపారు. పోటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, అధికారికంగా నియామక ఉత్తర్వులు పొందిన తర్వాత మొత్తం ప్రక్రియను రద్దు చేయడం తమను అన్యాయంగా శిక్షించడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగ హోదాపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని, పరీక్ష రద్దు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

## నీట్' విద్యార్థులపై పోలీసు చర్యలు- విచారణకు హైపవర్ కమిటీ ఏర్పాటు

### మొదటి పేజీ తరువాయి

మాజీ డీజీపీ, మాజీ సీబీఐ డైరెక్టర్లు ఉంటారని స్పష్టం చేసింది. ఇంకా ఈ కమిటీలో చేర్చాల్సిన ఇతర సభ్యుల గురించి వివిధ పక్షాల నుంచి సూచనలు అందిన తర్వాత, కమిటీ ఏర్పాటుకు సంబంధించిన ఉత్తర్వులను బుధవారం విడుదల చేస్తామని తెలిపింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణ చేపట్టింది. జులై 20న ఢిల్లీలో జరిగిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా జరిగిన హింసకు సంబంధించిన వీడియో ఫుటేజీ, సీసీటీవీ రికార్డింగ్ లను, తాము ఏర్పాటు చేయనున్న హైపవర్ కమిటీకి అందజేయాలని ఆదేశించనున్నట్లు పేర్కొంది. ఢిల్లీ సహా ఇతర ప్రాంతాల్లో జరిగిన నిరసనల్లో పాల్గొన్న మహిళల ఫిర్యాదులను, ఆరోపణలను కూడా ఈ కమిటీ పరిశీలిస్తుందని స్పష్టం చేసింది. విద్యార్థి నిరసనకారులపై నమోదైన ఎఫ్ ఐఆర్ లను రద్దు చేయడానికి వీలుగా వాటి వివరాలను సమర్పించాలని ధర్మాసనం సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోరింది. ఈ విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద కోర్టు తనకున్న సంపూర్ణ అధికారాలను ఉపయోగించుకోవచ్చని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా, విద్యార్థులు, నిరసనకారులు క్షమాపణలు చెప్పకుండా వారిపై ఉన్న కేసులను రద్దు చేయడాన్ని ఓ న్యాయవాది వ్యతిరేకించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, "ఇక్కడ



విద్యార్థుల జీవితాలు పణంగా ఉన్నాయి. దీనిని మనం పరిగణనలోకి తీసుకోవాలి. వారికి చాలా భవిష్యత్తు ఉంది. ఆర్టికల్ 19 ప్రకారం నిరసన తెలిపే హక్కు వారికి ఉంది" అని స్పష్టం చేసింది.

### అసాంఘిక శక్తులపై కేసులు తీసేయలేం!

మరోవైపు, నీట్ నిరసనల సమయంలో జరిగిన హింసకు సంఘ వ్యతిరేక శక్తులు కారణమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు చెప్పారు. జులై 20 నిరసనల సమయంలో 2800 మందికిపైగా ఘోరమైన నేరచరిత్ర కలిగిన వ్యక్తులను పోలీసులు గుర్తించినట్లు ఆయన తెలిపారు. వాస్తవానికి సర్వోన్నత న్యాయస్థానం ఆగస్టు 3వ తేదీనే 'నేర చరిత్ర' (క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్) అనే పదం గురించి స్పష్టత నిచ్చింది. విద్యార్థి నిరసనకారుల విడుదలకు సంబంధించిన ఉత్తర్వుల్లో 'నేర చరిత్ర' అనే పదం కేవలం ఘోరమైన, క్రూరమైన నేరాల్లో పాలుపంచుకున్నవారికి మాత్రమే వర్తిస్తుందని తేల్చిచెప్పింది. మిగిలిన విద్యార్థులపై ఉన్న ఎఫ్ ఐఆర్లను చట్టప్రకారం మూసివేయవచ్చని లేదా ఉపసంహరించుకోవచ్చని రాష్ట్రాలకు తెలిపింది. జులై 20న ఢిల్లీలో జరిగిన పార్లమెంట్ మార్చ్ సహా, నీట్ పేపర్ లీక్ నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులకు ఎలాంటి నేర చరిత్ర లేకపోతే, వారిపై నమోదైన ఎఫ్ ఐఆర్ లను కొనసాగించకూడదని తాము నిర్ణయించినట్లు కేంద్రం స్పష్టం చేసిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. అంతేకాదు, కేవలం ఆందోళనలు జరుగుతున్నంత మాత్రాన పోలీసులు అతిగా చర్యలు తీసుకోవడాన్ని, లాఠీ ఛార్జీ చేయడాన్ని సమర్థించలేమని గతంలోనే సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని స్పష్టం చేసింది. జులై 20న ఢిల్లీ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో సంసద్ ఛలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నిరసనకారులకు, భద్రతా సిబ్బందికి మధ్య ఘర్షణ చెలరేగింది. దీనితో పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి, బాష్పవాయువు ప్రయోగించారు. ఈ ఘటనలో చాలా మంది పోలీసులు, నిరసనకారులు గాయపడ్డారు.

## 2027 అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్ , గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లు

### మొదటి పేజీ తరువాయి

బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్‌కు అప్పగించారు. ఇతర రాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌ల నియామకాలను త్వరలో చేపడతామని బీజేపీ తెలిపింది. అప్పటివరకు ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభారీ వ్యవస్థ యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది.

### కొత్త టీమ్‌తో ఎన్నికల వ్యూహం

ఇదిలా ఉండగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కొత్త టీమ్‌ను సోమవారం ప్రకటించారు. అనుభవజ్ఞులతో పాటు యువ నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తూ కొత్త బృందాన్ని రూపొందించారు. జాతీయ ప్రధాన కార్యదర్శులుగా మాజీ అమేఠీ ఎంపీ స్మృతి ఇరానీ, మాజీ త్రిపుర ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ దేబ్, సునీల్ బన్సల్, వినోద్ తావ్డే, గజేంద్ర పటేల్, సతీశ్ పూనియా, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియాలకు కీలక బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో పలువురు సీనియర్ నేతలను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. మాజీ రాజస్థాన్ సీఎం వసుంధరా రాజే, మాజీ ఉత్తరాఖండ్ సీఎం తీరథ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ పాండా, డీ పురందేశ్వరి తదితరులకు ఈ జాబితాలో చోటు దక్కింది. మొత్తం 13 మంది కొత్త ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం విశేషం.

### విస్తృత ప్రాతినిధ్యంతో జాతీయ కార్యదర్శులు

జాతీయ కార్యదర్శుల నియామకాల్లోనూ దేశవ్యాప్తంగా భౌగోళిక



ప్రాతినిధ్యానికి బీజేపీ ప్రాధాన్యం ఇచ్చింది. మధ్యప్రదేశ్‌కు చెందిన కవితా పటిదార్, కేరళకు చెందిన కె. సురేంద్రన్, యూపీకి చెందిన డాక్టర్ భోలా సింగ్, ఝార్ఖండ్‌కు చెందిన ప్రదీప్ వర్మ, గుజరాత్‌కు చెందిన జగదీశ్ పటేల్, ఢిల్లీకి చెందిన సందీప్ పాఠక్ తదితరులకు జాతీయ కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగించారు. నాగాలాండ్‌కు చెందిన ఫాంగ్నోన్ కొన్యాక్, కేరళకు చెందిన అనిల్ ఆంటోనీ, తమిళనాడుకు చెందిన ఎం. వెంకటేశన్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన మనోజ్ తిగ్గా, బిహార్‌కు చెందిన సిద్ధార్థ్ శంభు, ఢిల్లీకి చెందిన స్వదేశ్ సింగ్, అసోంకు చెందిన మృగాంక దేవ్ బర్మన్, గుజరాత్‌కు చెందిన రోహన్ గుప్తా, ఢిల్లీకి చెందిన జై ప్రకాశ్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

### కీలక విభాగాలకూ కొత్త బాధ్యతలు

కేంద్ర ఆర్థిక వ్యవహారాల్లో కీలకమైన జాతీయ కోశాధికారి బాధ్యతలను పీయూష్ గోయల్‌కు మరోసారి అప్పగించారు. తరుణ్ చుగ్‌ను బీజేపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌గా నియమించారు.

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

బుధవారం 19-08-2026

## శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల 50వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ప్రారంభం

**తుని, ఆగస్టు 18,ప్రజా న్యూస్ నెట్వర్క్ :** శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలు 50వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంభించాయి. వేడుకల్లో భాగంగా నిర్వహించిన 'గాతా రహే మేరా దిల్' పాటల పోటీలు విద్యార్థులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి .తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలు ఫైనల్స్‌లో పోటీపడనుండగా, ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్పీ శైలజ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ సందర్భంగా సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లోని సంగీత ప్రతిభను వెలికితీయడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. వేడుకల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.




## అర్హులైన చేనేత కార్మికులందరికీ 'నేతన్న సేవలో' పథకం అందేలా చర్యలు- మంత్రి వంగలపూడి అనిత ఆదేశాలు..

**పాయకరావుపేట ఆగస్టు 18 ప్రజా న్యూస్ నెట్వర్క్:**పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో అర్హత కలిగిన చేనేత కార్మికులందరికీ 'నేతన్న సేవలో' పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. పలువురు అర్హులైన చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లో పథకం కింద నగదు జమ కాలేదని స్థానిక నాయకులు, చేనేత కార్మికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన మంత్రి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, అర్హత ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు సోమవారం పాయకరావుపేట చేనేత సొసైటీ కార్యాలయంలో జిల్లా జౌళి శాఖ డీవో యశ్వంత్ విచారణ నిర్వహించారు.అనంతరం మంగళవారం పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల ప్రాంతాలకు చెందిన నాయకులు నక్కపల్లిలో జిల్లా జౌళి శాఖ డీవో యశ్వంత్‌ను కలిసి పథకం అమలుపై ఫిర్యాదు చేశారు.నియోజకవర్గవ్యాప్తంగా 'నేతన్న సేవలో' పథకం అమలుపై పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి, అర్హత కలిగిన చేనేత కార్మికులందరికీ పథకం ప్రయోజనం అందేలా చూడాలని వారు కోరారు. అర్హత ఉన్న ఏ ఒక్క చేనేత కార్మికుడూ నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. అర్హులైన చేనేత కార్మికులందరి బ్యాంకు ఖాతాల్లో పథకం నగదు జమ అవుతుందని, ఈ విషయంలో ఎవరూ అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని నాయకులు తెలిపారు..




## షీలానగర్‌లో మట్టికుప్పలో రెండు మృతదేహాలు

**విశాఖపట్నం, ఆగస్టు 18: ప్రజా న్యూస్ విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం. నాయుడు :** షీలానగర్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న షీలానగర్, పోర్టు కనెక్టివిటీ రోడ్డు పనుల్లో మూడు గుర్తుతెలియని మృతదేహాలు వెలుగుచూశాయి. తెల్లవారుజామున డంపర్ లారీలు మట్టి వేస్తుండగా కుప్పలో శవాలు కనిపించాయి. మృతదేహాలు పూర్తిగా డికంపోజ్ అయ్యాయి. మట్టిలో పాత తలగడలు, బొంతలు కూడా లభించాయి. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 18 ప్రజా న్యూస్ నెట్వర్క్** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 366వ జయంతి సందర్భంగా చింతల్ డివిజన్ లోని భగత్‌సింగ్ నగర్‌లో ఉన్నటువంటి ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. బహుజన బిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని, ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బిల్లా వెంకటేష్, రోడా మేస్త్రీ నగర్ డివిజన్ అధ్యక్షుడు గుమస్తా మధుసూదన్‌తో పాటు మోటే శ్రీనివాస్ యాదవ్,అఖిల్ గౌడ్,శ్రీనివాస్ రెడ్డి, రమేష్ మంజూల్కర్, షాకీర్, చోటు, సలీం, మధు, రఘు, బలరాం తదితరులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## విద్యార్థినుల భద్రతే లక్ష్యం.. వేధింపులు, సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

### పాయకరావుపేట తిరుమల కళాశాలలో 'అభయ్' అవగాహన సదస్సు.. ఆపదలో డయల్ 112 వినియోగించుకోవాలని సి.ఐ సూచన




**పాయకరావుపేట, ఆగస్టు 18 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** పాయకరావుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో స్థానిక తిరుమల కళాశాలలో విద్యార్థినుల భద్రత, రక్షణపై 'అభయ్' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొనే సమస్యలు, వాటి నుంచి రక్షణ పొందేందుకు అందుబాటులో ఉన్న మార్గాలపై అవగాహన కల్పించారు.ఆపద లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు విద్యార్థినులు, మహిళలు ఎలాంటి సంకోచం లేకుండా పోలీసులను ఆశ్రయించాలని సి.ఐ సూచించారు. అవసరమైన సమయంలో డయల్ 112తో పాటు సంబంధిత భద్రతా వ్యవస్థలను వినియోగించుకోవాలని తెలిపారు.ఈవ్ టీజింగ్, వివిధ రకాల వేధింపులు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఆయా సమస్యల విషయంలో చట్టపరంగా అందుబాటులో ఉన్న రక్షణ మార్గాలపై సమగ్ర అవగాహన కల్పించారు.విద్యార్థినులు భయాన్ని వీడి నిర్భయంగా తమ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సి.ఐ పేర్కొన్నారు. మహిళల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## విశాఖలో జాతీయ మత్స్యకార సంఘం అవగాహన సదస్సు





**విశాఖపట్నం ఆగస్టు 18: ప్రజా న్యూస్ నెట్వర్క్: విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం.నాయుడు.** విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో జాతీయ మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ మత్స్యకార సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మోస అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మత్స్యకారుల స్థితిగతులు, సంక్షేమ పథకాలు, మత్స్యకారుల సమస్యలు, రాజకీయ ప్రాధాన్యత తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమానికి ఎక్స్ సైన్సర్, బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ చౌడిపల్లి సుధాకర్, ఫిష్ స్కాన్ జనరల్ సెక్రటరీ అర్జీలు దాసు, వాసుపల్లి నాగరాజు, పెద్దలు చంద్రమౌళి, గౌరవ అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్, ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు, అధ్యక్షులు మైలపల్లి నరసింహులు, విజయనగరం జిల్లా పేర్ల నూకరాజు, విశాఖపట్నం జిల్లా ఎరిపల్లి అప్పలరాజు, అనకాపల్లి జిల్లా నాయకులు, కుల పెద్దలు, మత్స్యకార సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 1,000 కిలోమీటర్ల సముద్ర తీరం ఉన్నప్పటికీ ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు తక్కువగా ఉండటంతో మత్స్యకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మత్స్యకారులు, మత్స్యకార కుల పెద్దలను సంబంధిత మంత్రుల వద్దకు తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సుధాకర్ మాట్లాడుతూ జాతీయ మత్స్యకార సంఘాన్ని వీఆర్ రావు, ఇతర పెద్దలు 1979లో స్థాపించారని తెలిపారు. మత్స్యకారులు, ఎన్ఎఫ్‌డీబీ, ఎస్టీ, ఎస్సీ వర్గాలకు సంబంధించిన అంశాలతో పాటు మత్స్యకారులకు అవసరమైన సంక్షేమ పథకాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘం పనిచేస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కమిటీలను ఏర్పాటు చేయాలని అప్పట్లో తీర్మానించినట్లు వివరించారు. జాతీయ మత్స్యకార సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షులు మోస అప్పలరాజు మాట్లాడుతూ మత్స్యకార ఉపకులాల కోసం పార్టీలకు అతీతంగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన వారు జాతీయ మత్స్యకార సంఘంలో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. మత్స్యకారులకు రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయడం, ఎస్సీ, ఎస్టీ జాబితాల్లో చేర్చే విధానం, ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తే వారి వలసలను అరికట్టడంతో పాటు వారికి న్యాయం చేసినట్లవుతుందని పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా మత్స్యకారులకు న్యాయం చేస్తే వారిని మత్స్యకారులు గుర్తుంచుకుంటారని తెలిపారు. విశాఖ జిల్లా అధ్యక్షులు పేర్ల నూకరాజు మాట్లాడుతూ గంగవరంలో ఫిషింగ్ హార్బర్‌ను తక్షణమే నిర్మించాలని కోరారు. గంగవరం ప్రాంతంలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, కాలుష్యం కారణంగా మత్స్యకారులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. మత్స్యకారులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం జాతీయ మత్స్యకార సంఘం ఏపీ రాష్ట్ర కమిటీ నిరంతరం ప్రభుత్వ దృష్టికి అంశాలను తీసుకెళ్తుందని మోస అప్పలరాజు తెలిపారు. సమస్యలకు పరిష్కారం లభించే వరకు మత్స్యకారులకు అండగా ఉంటామని పేర్కొన్నారు.

## వర్షాల కోసం రైతులతో కలిసి యనమల రామకృష్ణుడు వరుణ యాగం..

### 19 నుంచి యనమల గార్డెన్స్‌లో మహా యజ్ఞం

**తుని (తేటగుంట), ఆగస్టు 17 ప్రజా న్యూస్ నెట్వర్క్:** ఎలినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వ చర్యలతో పాటు మానవ ప్రయత్నాలు కూడా అవసరమని పేర్కొన్నారు. రైతు సుభిక్షంగా ఉంటేనే సమాజం క్షేమంగా ఉంటుందని అన్నారు.అన్నదాతల శ్రేయస్సు కోసం రైతుల భాగస్వామ్యంతో వరుణ యాగాన్ని నిర్వహించనున్నట్లు యనమల తెలిపారు. ఈ నెల 19 నుంచి నాలుగు రోజులపాటు యనమల గార్డెన్స్‌లో ఋత్వికుల వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా రైతులు చేపడుతున్న ఈ వరుణ యాగానికి కులమత భేదాలు లేకుండా అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యనమల కోరారు. యజ్ఞయాగాలు నిర్వహించడం తమ ధర్మమని, భగవంతుడి కరుణతో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. తుని నియోజకవర్గం నలుదిశలా పీసీసీ, పుష్కర, పంపా జలాశయాలు ఉన్నప్పటికీ ప్రస్తుతం తగిన స్థాయిలో నీటి నిల్వలు లేవని యనమల పేర్కొన్నారు. వర్షాలు కురిస్తేనే ఖరీఫ్ సాగు ముందుకు సాగే పరిస్థితి ఉందన్నారు. పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ రైతులు వరుణ యాగం నిర్వహించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం అభినందనీయమని యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు.



## ప్రజా న్యూస్ నెట్‌వర్క్ కథనానికి స్పందన

### ఎన్ఎస్‌పీ క్యాంప్ పాఠశాలను పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి హామీ

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ పట్టణంలోని జడ్‌పీహెచ్ఎస్ ఎన్ఎస్‌పీ క్యాంప్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, భద్రతా సమస్యలపై ప్రజా న్యూస్ నెట్‌వర్క్ దినపత్రికలో ప్రచురించిన ప్రత్యేక కథనానికి బీఆర్ఎస్ నాయకులు స్పందించారు. విద్యార్థుల సమస్యలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు సంబంధిత వర్గాలు స్పందించేలా ప్రజా న్యూస్ నెట్‌వర్క్ ప్రచురించిన కథనంపై స్పందించిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు మంగళవారం ఎన్ఎస్‌పీ క్యాంప్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, తరగతి గదుల పరిస్థితి, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలను నాయకులు పరిశీలించారు. విద్యార్థులు తమకు ఎదురవుతున్న ఇబ్బందులను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం, విద్యార్థులకు మరింత మెరుగైన సౌకర్యాలు అవసరమవడం వంటి అంశాలను ఉపాధ్యాయులు కూడా నాయకులకు వివరించారు. విద్యార్థుల చదువుకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.విద్యార్థులు,ఉపాధ్యాయులు వెల్లడించిన సమస్యలను ఏనుగుల రాకేష్ రెడ్డి ఓపికగా విని, పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మంచి విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండటం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకునేలా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకే పాఠశాలను సందర్శించామని, పాఠశాలలోని పరిస్థితులను పరిశీలించడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నామని తెలిపారు. విద్యార్థుల సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయాల్లో నిర్లక్ష్యం ఉండకూడదని, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.అనంతరం పిల్లుట్ల రఘు మాట్లాడుతూ.. ప్రజా న్యూస్ నెట్‌వర్క్ ప్రచురించిన కథనం ద్వారా ఎన్ఎస్‌పీ క్యాంప్ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు.సమస్యలు కేవలం వార్తల్లోనే కాకుండా క్షేత్రస్థాయిలో ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు పాఠశాలను స్వయంగా సందర్శించామని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన తర్వాత పాఠశాలలో పరిష్కరించాల్సిన పలు అంశాలపై స్పష్టత వచ్చిందన్నారు. విద్యార్థుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.విద్యార్థులకు సంబంధించిన సమస్యలపై రాజకీయాలకు అతీతంగా స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఎన్ఎస్‌పీ క్యాంప్ పాఠశాలకు ఎంతోకాలంగా ప్రత్యేక చరిత్ర ఉందని, ఈ పాఠశాలలో చదువుకున్న అనేక మంది విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగారని వారు గుర్తుచేశారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కూడా మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు, భద్రతా సౌకర్యాలు కల్పించాలని తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వచ్చి ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునే పరిస్థితులు ఉండాలని, పాఠశాల భవనం మరియు పరిసర ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు కూడా పాఠశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజా న్యూస్ నెట్‌వర్క్ ప్రచురించిన ప్రత్యేక కథనానికి స్పందనగా బీఆర్ఎస్ నాయకులు పాఠశాలను సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. వార్త ప్రచురితమైన అనంతరం సమస్యలను స్వయంగా పరిశీలించేందుకు నాయకులు పాఠశాలకు రావడం, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకోవడం పట్ల స్థానికులు స్పందిస్తున్నారు. సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మాత్రమే కాకుండా వాటి పరిష్కారం కోసం సంబంధిత వర్గాలు స్పందించేలా ప్రజా న్యూస్ నెట్‌వర్క్ తన బాధ్యతను కొనసాగిస్తోందని పలువురు పేర్కొన్నారు.అయితే పాఠశాలను సందర్శించి హామీ ఇవ్వడం వరకు మాత్రమే పరిమితం కాకుండా, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలకు వాస్తవ పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. పాఠశాలలో అవసరమైన వసతులు ఏర్పాటు చేయడానికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు రావాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి అవసరమైన నిధులు, మౌలిక వసతులు, భద్రతా చర్యలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఎన్ఎస్‌పీ క్యాంప్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొహమ్మద్ జానీ, సిరికొండ వెంకటయ్య, వేముల శ్రీనివాస్, కె.వి. సత్యనారాయణ, రవి, అనూష, జయ, లావణ్య, ప్రియాంక తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు కూడా తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.ప్రజా న్యూస్ నెట్‌వర్క్ కథనానికి స్పందించిన బీఆర్ఎస్ నాయకులు పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడంతో ప్రస్తుతం అందరి దృష్టి సమస్యల పరిష్కారంపై పడింది. నాయకులు ఇచ్చిన హామీ ఎంతవరకు కార్యరూపం దాల్చుతుంది, పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి, సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారనేది ఇప్పుడు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజల్లో ఆసక్తికరంగా మారింది. విద్యార్థుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ప్రజా న్యూస్ నెట్‌వర్క్ సమస్యను ప్రజల దృష్టిలో ఉంచి సంబంధిత అధికారుల స్పందనను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు.



## మోటార్ కేబుల్ వైర్ దొంగతనం కేసులో ముగ్గురు అరెస్ట్



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** చిలుకూరు గ్రామ పరిధిలో వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లను దొంగతనం చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిలుకూరు గ్రామానికి చెందిన రైతు నాగిరెడ్డి రామిరెడ్డి తన పొలం వద్ద ఉన్న బావికి ఏర్పాటు చేసిన మోటార్‌కు సంబంధించిన కేబుల్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించుకెళ్లారని ఆగస్టు 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు.ఈ క్రమంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అటుగా వచ్చిన ఓ ఆటోను ఆపి తనిఖీ చేశారు. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో దండగల సురేష్, చింతల గోపమ్మ, సంపంగి గోపి అనే ముగ్గురు వ్యక్తులు మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్ల దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల ఎదుట నేరాన్ని అంగీకరించినట్లు ఎస్ఐ బండి మోహన్ బాబు తెలిపారు.విచారణలో ఇప్పటివరకు సుమారు 20 మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లను దొంగతనం చేసినట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. వ్యవసాయ పొలాల్లో రైతులు ఉపయోగించే మోటార్ల కేబుల్ వైర్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. రైతు నాగిరెడ్డి రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, దొంగతనాలకు ఉపయోగించినట్లు భావిస్తున్న ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.అనంతరం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ బండి మోహన్ బాబు విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పొలాల్లో మోటార్ కేబుల్ వైర్ల దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, రైతులు తమ పొలాల్లోని మోటార్లు, విద్యుత్ కేబుల్ వైర్ల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రైతుల ఫిర్యాదులను స్వీకరించి వాటిపై సమగ్రంగా దర్యాప్తు చేసి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు వాహనాల తనిఖీలు, అనుమానితులపై నిఘా కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు



**సూర్యాపేట, ఆగస్టు 18,ప్రజా న్యూస్ నెట్వర్క్ :** హుజూర్‌నగర్ పట్టణంలోని వెంకట్‌నగర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జై గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చేసిన పోరాటాన్ని కొనియాడారు. ఆయన ఆశయాలు నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.కార్యక్రమంలో విద్యార్థులకు స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేసి పాపన్న గౌడ్ చరిత్రను వివరించారు. మాజీ ఎంపీపీ నరసింహ వెంకటేశ్వర్లు గౌడ్, వల్లపుదాసు కృష్ణ గౌడ్, బెల్లంకొండ లలితా శ్రీనివాస్ గౌడ్, జై గౌడ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోదాడ ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దశరథకు ఘన సన్మానం



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి** కోదాడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఉత్తమ వైద్య సేవలు అందించడంతో పాటు విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి సూర్యాపేట జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ డాక్టర్‌గా ప్రశంసా పురస్కారం అందుకున్న తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ దశరథను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కోదాడ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డాక్టర్ దశరథను అభినందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గుండెపంగు రమేష్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో డాక్టర్ దశరథ చురుకుగా పాల్గొని ఉద్యమ కార్యక్రమాలకు తన వంతు సహకారం అందించారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు పలు కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం వైద్య వృత్తిలో కొనసాగుతూ కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టి నిరుపేదలు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రిలోని సేవలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ డాక్టర్‌గా ప్రశంసా పురస్కారం అందుకోవడం అభినందనీయమని గుండెపంగు రమేష్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన వ్యక్తి నేడు వైద్య రంగంలో కూడా తన సేవలతో ప్రజలకు అండగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. డాక్టర్ దశరథ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు వైద్యులు, సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలను అందిస్తూ నిరుపేదలకు అండగా నిలవడం ద్వారా డాక్టర్ దశరథ ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డాక్టర్ దశరథ సేవలను కొనియాడుతూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సీనియర్ నాయకులు కుక్కడపు బాబు, ఉద్యమకారుల ఫోరం చిలుకూరు మండల అధ్యక్షులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మునగాల మండల అధ్యక్షులు పోలంపల్లి వెంకటేశ్వర్లు, అనంతగిరి మండల అధ్యక్షులు సైదులు నాయక్, జనార్ధన్ రావు, గోపాల్, పగిడిపర్తి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# కుమారపురం యువతి అదృశ్యం విషాదాంతం.. పంపా నదిలో మృతదేహం లభ్యం

### ఆగస్టు 14న ఇంటి నుంచి వెళ్లిన 19 ఏళ్ల నందిని..
### ప్రమాదవశాత్తు నదిలో పడి మృతి చెందినట్లు తల్లి ఫిర్యాదు



**పాయకరావుపేట ఆగస్టు 18 ప్రజా న్యూస్ నెట్వర్క్:** పాయకరావుపేట మండలం కుమారపురం గ్రామానికి చెందిన చేపల బంగారు లక్ష్మీ, తన కుమార్తె చాపల నందిని (19) కనిపించడం లేదంటూ ఇచ్చిన ఫిర్యాదు విషాదాంతమైంది. ఆగస్టు 14న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన నందిని తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆగస్టు 15న పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఎస్ఐ పురుషోత్తం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో కుమారపురం గ్రామ శివారులోని పంపా నదిలో నందిని మృతదేహం కనిపించగా, ఆమె తల్లి మృతురాలిని తన కుమార్తెగా గుర్తించారు.నందిని సుమారు మూడు నెలలుగా టైఫాయిడ్ జ్వరంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ పాయకరావుపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తల్లి తెలిపినట్లు సమాచారం. అలాగే ఆమె మానసిక అనారోగ్యంతోనూ బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 14న మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత నందిని బహిర్భూమి నిమిత్తం లేదా ఇతర కారణాలతో పంపా నది వద్దకు వెళ్లి ఉండవచ్చని, అనారోగ్య పరిస్థితుల కారణంగా ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడిపోయి ఉండవచ్చని తల్లి తెలిపినట్లు పేర్కొన్నారు. ఈత రాకపోవడంతో నీటిలో ఊపిరాడక మృతి చెంది ఉండవచ్చని ఆమె ఇచ్చిన రిపోర్టులో పేర్కొన్నారు. ఈ ఘటనపై తల్లి మరోసారి పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.






# నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి
### హుజూర్‌నగర్ నిరుద్యోగుల సదస్సులో బీఆర్ఎస్ నేతల డిమాండ్



**నారాయణపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగుల సదస్సుకు ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి, హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని, పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వెంటనే చేపట్టాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను గుర్తించి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు స్పష్టమైన భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. కేవలం హామీలు, ప్రకటనలకే పరిమితం కాకుండా ఉద్యోగ నియామకాలకు సంబంధించిన స్పష్టమైన కార్యాచరణను ప్రకటించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను గుర్తు పెట్టుకుని రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉద్యోగ నియామక ప్రక్రియలో పారదర్శకత, వేగం ఉండాలని, ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం ఎలాంటి జాప్యం చేయకూడదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో యువత కీలక పాత్ర పోషించిందని, అలాంటి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య కేవలం వ్యక్తిగత సమస్య కాదని, కుటుంబాలు, సమాజం, రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు వయోపరిమితి, పరీక్షలు, నియామకాల విషయంలో స్పష్టత ఇవ్వాలని కోరారు. నిరుద్యోగ యువత హక్కుల కోసం, ఉద్యోగాల కోసం, తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని నాయకులు



తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై యువత తరఫున ప్రశ్నిస్తామని, నిరుద్యోగుల సమస్యలను ప్రజా వేదికలపైకి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఈ నిరుద్యోగుల సదస్సు ద్వారా యువత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సదస్సుకు హాజరైన నిరుద్యోగులు, యువత తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగ నియామకాల్లో జాప్యం, ఖాళీల భర్తీ, ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం ఎదురుచూపులు వంటి అంశాలను వారు ప్రస్తావించారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేసి, రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి కార్యాచరణ ప్రారంభించాలని బీఆర్ఎస్ నాయకులు మరోసారి డిమాండ్ చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

### ఆగస్టు 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం
### 14వ వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ పట్టణంలోని 14వ వార్డు ప్రజలతో పాటు పట్టణంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన పింఛన్ల ప్రక్రియలో భాగంగా తమ దరఖాస్తులను సమర్పించుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు కోరారు. పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆగస్టు 30వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున అర్హులైన వారు ఎలాంటి ఆలస్యం చేయకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 14వ వార్డులో అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన పింఛన్ దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వృద్ధాప్య పింఛన్లు మినహా చేనేత కార్మికులు, వితంతువులు, కల్లు గీత కార్మికులు, ఒంటరి మహిళలు, దయాలసిస్, క్యాన్సర్ తదితర కేటగిరీలకు చెందిన అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, బ్యాంక్ ఖాతా జిరాక్స్, అవసరమైన చోట మరణ ధృవీకరణ పత్రం జిరాక్స్, ఆదాయ ధృవీకరణ పత్రం జిరాక్స్, ఓటరు గుర్తింపు కార్డు, వికలాంగులకు వికలాంగుల ధృవీకరణ పత్రం, గౌడ కుల వృత్తికి సంబంధించిన అర్హత పత్రాలు, గౌడ్ సంఘం సభ్యత్వ కార్డు తదితర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని కౌన్సిలర్ సూచించారు. లబ్ధిదారులు దరఖాస్తు ప్రక్రియలో ఇబ్బందులు పడకుండా తానే స్వయంగా దరఖాస్తులను పూర్తి చేసి మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేయించడం జరుగుతుందని తెలిపారు. 14వ వార్డుకు చెందిన అర్హులైన ప్రజలతో పాటు హుజూర్‌నగర్ పట్టణంలోని ఇతర ప్రాంతాలకు చెందిన అర్హులైన ప్రజలు కూడా ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. గడువు ముగిసిన తర్వాత అవకాశం కోల్పోకుండా ముందుగానే అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుని దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. పింఛన్ పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ దరఖాస్తు ప్రక్రియపై అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొనే వారికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోల్లపూడి కళ్యాణ్, అలవాల ఉపేందర్, అలవాల నరేష్, లింగం రవి, మామిడి సామెల్, బెంజిమెన్ మామిడి, నరసింహారావు, లక్ష్మణ్, యోహాన్, అనిల్, లింగం సైదమ్మ, కమలమ్మ, శామలమ్మ, షాహిన్ తదితరులు పాల్గొన్నారు.


# ప్రజా భద్రతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

### కమ్యూనిటీ సీసీ కెమెరాలు ధ్వంసం చేసి పోలీస్ విధులకు ఆటంకం
### కౌన్సిలర్ సహా ఆరుగురు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** ప్రజా భద్రతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు కౌన్సిలర్ పడిదల సైదులు సహా మరో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆగస్టు 18న సూర్యాపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సోమవారం రాత్రి చివ్వెంల మండల పరిధిలోని బీబిగూడెం గ్రామం, సూర్యాపేట మున్సిపాలిటీ 3వ వార్డు ప్రాంతంలో ప్రజా భద్రత కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీ కెమెరాలను కొందరు వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారంటూ డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందిందని సీఐ తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే చివ్వెంల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి సంఘటనపై విచారణ చేపట్టారని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ధ్వంసానికి పాల్పడిన వ్యక్తులను స్థానిక కౌన్సిలర్ పడిదల సైదులు, అతని సహచరులుగా గుర్తించినట్లు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకునే సమయంలో కౌన్సిలర్‌తో పాటు అతని వెంట ఉన్న వ్యక్తులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని సీఐ పేర్కొన్నారు. ఈ ఘటనపై చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడిగా 3వ వార్డు కౌన్సిలర్ పడిదల సైదులుతో పాటు అతని సహచరులు పడిదల దుర్గాప్రసాద్, పడిదల కిరణ్, మత్స రాంబాబు, గోల్కొండ మురళి, పడిదల సతీష్‌లను అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు. మొత్తం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని చట్టపరమైన ప్రక్రియ అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీ కెమెరాలు నేరాల నియంత్రణ, నేరాల దర్యాప్తులో కీలక పాత్ర పోషిస్తాయని సీఐ రాజశేఖర్ పేర్కొన్నారు. అలాంటి ప్రజా భద్రతకు సంబంధించిన రక్షణ వ్యవస్థలు, సాంకేతిక పరికరాలు, ఇతర సామగ్రిని ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేయడం లేదా వాటికి నష్టం కలిగించడం వంటి చర్యలను పోలీసులు ఏమాత్రం సహించబోరని స్పష్టం చేశారు. ప్రజా భద్రత కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థలకు నష్టం కలిగించే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించడం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేయడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని, పోలీసుల విధులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా భద్రతకు సంబంధించిన సీసీ కెమెరాలు, ఇతర రక్షణ వ్యవస్థలను ప్రతి ఒక్కరూ కాపాడాలని, వాటి పనితీరుకు ఆటంకం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద సంఘటనలు లేదా ప్రజా భద్రతకు ముప్పు కలిగించే చర్యలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో చివ్వెంల ఎస్సై మహేష్, ఎస్సై-2 వెంకన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 296 డివిజన్ పరిధిలోని దుండిగల్ గ్రామం కింది బస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మేడ్చల్ జిల్లా డీసీసీ వైస్ ప్రెసిడెంట్ అమరం ముత్యం రెడ్డి దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 18 ప్రజా న్యూస్ నెట్వర్క్** స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు సంబంధిత అధికారులతో మాట్లాడి, కింది బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టి, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతాం.ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తాం.ఈ కార్యక్రమంలో పందుగ శ్రీశైలం ముదిరాజ్ వాపుల శ్రీనివాస్ ,పోతారం మల్లేష్ పిట్ల గణేష్ మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు కింది బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

## మయోర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కార్మికుల ధర్నా కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపిన బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిలి

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 18 ప్రజా న్యూస్ నెట్వర్క్** మేడ్చల్ గుండ్ల పోచంపల్లి ఇండస్ట్రీ లోని “మయోర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కార్మికుల వేతనాలు పెంచాలని కంపెనీ ఎదుట కార్మికులు ధర్మ చేపట్టడం జరిగింది.. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, బి ఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి, బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాయ రాజయ్య, జనరల్ సెక్రెటరీ జె సంతోష్ కుమార్, ధర్నా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.. యూనియన్ కార్మిక నాయకులు మాట్లాడుతూ వెంటనే కార్మికులకు రావాల్సిన వేతనం పెంచాలని, అలాగే ఈఎస్ఐ, పీఎఫ్ ప్రతి ఒక్కరికి ఉండాలని తెలిపారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని సంఘీభావం తెలిపారు.. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు...

